
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 2 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర: 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.127	208	238
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 । కనిష్ఠం 19.0



నల్లగొండ జిల్లా కేంద్రంలో కమ్ముకున్న మబ్బులు

మబ్బులు కమ్మి.. వర్షం కురిసి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం, రాత్రి చిరు జల్లులు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఫెంగల్ తుపాను ప్రభావంతో శనివారం నుంచే ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. వాతావరణం ఒక్కసారిగా మారింది. శనివారం సాయంత్రం అక్కడక్కడ చిరు జల్లులు కురవగా, ఆదివారం సాయంత్రం, రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. వరదలో ధాన్యం కొట్టుకుపోయింది. 17శాతం శాతం వచ్చేందుకు ఆరబోసిన ధాన్యం వర్షంతో తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.

6



నాలుగో విడత రుణమాఫీకి సన్నాహాలు

- జిల్లా వ్యాప్తంగా మాఫీకానున్న రూ.236.90కోట్లు
- 21,432మంది రైతులకు లబ్ధి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నల్లగొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీకి సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా రుణమాఫీ చేసిన ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీకి సంబంధించిన జాబితాను సిద్ధం చేసి ఆదివారం విడుదల చేసింది. మొదటి విడత రూ.1లక్షలోపు వరకు రుణాలు జిల్లా వ్యాప్తంగా 99,839మంది రైతులకు చెందిన రూ.579.14కోట్లు మాఫీ అయ్యాయి. రెండో విడత రూ.1.50లక్షల లోపు 54,551మంది రైతులకురూ.632.92కోట్లు మాఫీ అయ్యాయి. ఆతరువాత మూడో విడత రూ.2లక్షల వరకు 33,804మంది రైతులకు రూ.55.9 2కోట్లు రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఆ తరువాత నిలిపివేసింది. అయితే రూ.2 లక్షలపైగా రుణాలు ఉన్నవారికి రూ.2లక్షల మేరకు మాఫీ కాలేదు. దీంతో రైతు లు ఆందోళనలు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆదివారం మరో విడత రుణమాఫీకి రైతుల పేర్లను విడుదల చేసింది. నాలుగో విడతలో 21,432మంది రైతుల కు రూ.236.90కోట్ల రుణాలు మాఫీకానున్నాయి. అయితే నాలుగో విడతతో రైతులందరికీ రుణమాఫీ పూర్తవుతుందా లేదా అనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది. ఈ విడతకు సంబంధించి జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు సిబ్బంది కూడా జాబితాలను ప్రభుత్వం అందజేసింది.

కోర్టు నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు



జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజుకు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నిడమనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలో నిర్మిస్తున్న మున్సిఫ్ కోర్టు భవనం పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు ఆదేశించారు. ఆదివారం నిడమనూరులో నిర్మాణంలో ఉన్న కోర్టు పనులను ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారిని బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, న్యాయవాదులు మువ్వా అరుణ్‌కుమార్, బొల్లం శ్రీనివాస్‌యాదవ్, పాదిల శ్రీనివాస్, నాగరాజు, వినోద్, మేఘారెడ్డి, పుల్లారెడ్డి, స్వర్ణలత, మట్టయ్య, జయమ్మ, రాజు, కోటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు శాలిగౌరారం ప్రాజెక్టు నీటి విడుదల



శాలిగౌరారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి సాగునీటి సోమవారం విడుదల చేయనున్నారు. ఉదయం 10గంటలకు నీటిని ఎమ్మెల్యే మందుల సామేలు విడుదల చేస్తారని ఐబీ ఏఈ రాములు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 18అడుగుల నీరు ఉంది. యాసంగి సీజన్‌లో కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా 5వేల ఎకరాలకు సాగునీటిని అందించనున్నారు. నీటి విడుదల కార్యక్రమానికి అధికారులు, రైతులు సకాలంలో హాజరు కావాలని ఏఈ కోరారు.

డీవైఎస్‌వో ఆధ్వర్యంలో 2కే రన్



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఆదివారం డీవైఎస్‌వో ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 2కే రన్‌ను నిర్వహించారు. ఎన్జీ కళాశాల ఆవరణలో ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీవైఎస్‌వో విష్ణుమూర్తిగౌడ్ హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి, జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకు ఈ పరుగు సాగింది. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి కుంభ నర్సిరెడ్డి, జిల్లా కార్యదర్శి డి.విమల, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముల్కా నాగిరెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంభులింగం, కోచ్ నారాయణ, కిరణ్‌కుమార్, ఎండి.నజీరుద్దీన్, సురేష్‌రెడ్డి, పి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మోదం.. ఖేదం




కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో హడావిడిగా ఇచ్చిన జీవో 317తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొంత ఊరట కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం జీవోనెం 243, 244, 245 ద్వారా పలు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల్లో స్థానికత కోల్పోయినవారి గురించి, స్థానికత ఉన్న జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీతో ఇబ్బందులు పడుతున్నవారి గురించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అసంతృప్తి నెలకొంది.

- 317 జీవో బాధితులకు కొంత ఉపశమనం
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- స్పౌజ్, మ్యూచువల్, హెల్త్ గ్రౌండ్ బాధితులకే ఉపయోగం
- కీలకమైన స్థానికత అంశాన్ని విస్మరించడంపై అసంతృప్తి

నల్లగొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం తాజాగా విడుదలచేసిన జీవోల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల స్పౌజ్ విషయాన్ని పట్టించుకోలేదని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉపశమనం కలుగుతుందని భావిస్తున్న స్పౌజ్, మ్యూచువల్, హెల్త్ గ్రౌండ్ బదిలీల్లోనూ పలు షరతులు విధించారని, విశాల దృక్పథంతో మేలు జరిగేలా, ఎన్నికల సమయంలో 317 జీవో బాధితులకు ఇచ్చిన హామీని అమలుచేయాలని ప్రభుత్వాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉమ్మడి జిల్లా నుంచి ఆయా జిల్లాలకు ఉద్యోగ, ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం 317 జీవోను జారీచేసింది. సీనియారిటీ ఆధారంగా ఉద్యోగులను కొత్త జిల్లాలకు బదిలీచేస్తూ 2021 డిసెంబరు 6న అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు ఈ బదిలీలు జరగడంతో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయ, ఉద్యోగులు స్థానికతను కోల్పోయారు. దీంతో అప్పటి నుంచి వీరంతా స్థానికత ఆధారంగా బదిలీలను సవరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆందోళనలు, ఉద్యమాలు కూడా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నేతలు కూడా తాము అధికారంలోకి రాగానే జీవో 317 బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు మంత్రి దామోదర రాజనరసింహ అధ్యక్షతన ఓ సబ్‌కమిటీని ప్రభుత్వం ఫిబ్రవరిలో నియమించింది. ఈ కమిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ బాధితులతోపాటు నాయకుల నుంచి దరఖాస్తులు, వినతులు తీసుకుంది. అయితే గత ప్రభుత్వం చివరలో అమలు చేసిన మాదిరిగా స్పౌజ్, మ్యూచువల్, హెల్త్‌గ్రౌండ్ పరిధిలోకి వచ్చే ఉపాధ్యాయ, ఉద్యోగులకు బదిలీలకు అవకాశం కల్పిస్తూ తాజాగా, ఉత్తర్వులిచ్చింది. అంతేతప్ప కీలకమైన, ఎక్కువ మంది బాధితులు కోరుతోన్న స్థానికత అంశాన్ని పట్టించుకోకపోవడంపై ఉద్యోగుల్లో అసహనం వ్యక్తమవుతోంది. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా

-మిగతా 6వ పేజీలో





317 జీవోతో నష్టపోయిన వారందరికీ న్యాయం చేయాలి



ప్రభుత్వం విడుదలచేసిన తాజా జీవోలతో స్థానికత కోల్పోయిన వారికి ఎలాంటి ఉపశమనం ఉండదు. వారి ఇబ్బందులను సబ్‌కమిటీ పరిశీలించలేదు. 317 జీవోతో నష్టపోయిన, స్థానికత కోల్పోయినవారందరికీ న్యాయం చేసేలా పరిశీలించాలి. స్పౌజ్, మ్యుచువల్, హెల్త్‌గ్రౌండ్ కింద గత ప్రభుత్వ హయాంలో కొందరికి బదిలీలయ్యాయి. దాన్నే కొనసాగించేలా తాజా జీవోలున్నాయి. స్థానికత ఆధారంగా, కేంద్ర ప్రభుత్వ స్పౌజ్‌ల సర్దుబాటు చేసి అందరికీ న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గత ఎన్నికల ముందు 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

- వెంకటేశం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

కొత్త జీవోలను స్వాగతిస్తున్నా



జీవో 317తో బదిలీ జరిగి ఇబ్బందిపడుతున్న ఉద్యోగులకు ఉపశమనం కలిగేలా క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయం మేరకు తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో 243, 244, 245లను స్వాగతిస్తున్నాం. మ్యుచువల్, స్పౌజ్, మెడికల్ గ్రౌండ్స్‌లో ఉద్యోగులను ఖాళీలతో సంబంధం లేకుండా కొత్త పోస్టులను క్రియేట్ చేస్తూ అందరికీ అవకాశం ఇవ్వాలి. మ్యుచువల్ బదిలీల్లో సర్వీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలి. 317జీవో తో నష్టపోయిన ఉద్యోగులందరికీ దశలవారీగా న్యాయం జరుగుతుందనే ఆశాభావంతో ఉన్నాం. ఉద్యోగ సమస్యలపై ప్రభుత్వం స్పందించినందుకు కృతజ్ఞతలు.

- జే.శేఖర్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి

సమస్యలుంటే నేరుగా సంప్రదించండి

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



అయ్యప్ప స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దామరచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వాచ్యాతండా బాలికల మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. భోజనం, పుస్తకాల విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదిస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ రూరల్): ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకొని శాంతియుత వాతావరణంలో కొనసాగాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని ఆలగడప గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూజా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అయ్యప్ప అభిషేకాల్లో ఆయన పాల్గొన్నారు. మిర్యాలగూడ పరిసర ప్రాంత గ్రామాలతోపాటు వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప, భవాని, శివ, ఆంజనేయ దీక్షాధారులు పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పూసపాటి వెంకన్న గురుస్వామి, కొత్త శ్రీనివాస్ గురుస్వామి, జెట్టి సైదులు, చెన్నబోయిన శ్రీవిద్, పవన్ పాల్గొన్నారు.

పోలీస్ కృష్ణయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలి

నల్లగొండ, దేవరకొండ, డిండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీసుశాఖకు చెందిన కృష్ణయ్య ముదిరాజ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. కృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుడు కృష్ణయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బొమ్మరబోయిన కేశవులు, శంకర్, రమణ, యాదయ్య అశోక్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణయ్య వర్ధంతి కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రసమళ్ల నాగయ్య, జింకల లింగయ్య, రెడ్డి శంకర్, అజయ్, రవి, నీలం వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్య ప్రాణత్యాగంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిందని ముదిరాజ్‌సంఘం డిండి మండల అధ్యక్ష, కార్యదర్శులు పోలం శ్రీను, బలుముల ప్రేమ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కృష్ణయ్య అమరత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఎందరికో స్ఫూర్తినిచ్చిందన్నారు. ట్యాంక్‌బండ్‌పై కృష్ణయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తవిటి సుధాకర్, కటికర్ల శ్రీను, నూకం శ్రీను, పోలం మల్లేష్, సాయిబాబు, చంద్రయ్య, సైదులు, అంజి, సందీప్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెరిగింది

డాక్టర్ హరికృష్ణ



విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

నల్లగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెరగడంతో 9.0శాతంగా ఉన్న పాజిటివ్ శాతం ప్రస్తుతం 0.5శాతానికి తగ్గిందని వైద్య ఆరోగ్యశాఖ (లెప్రసీ, ఎయిడ్స్) ఇన్‌చార్జి అదనపు అధికారి డాక్టర్ హరికృష్ణ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భం సమయంలో తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా కాపాడేందుకు ఏఆర్‌టీ మందులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ అధికారి సుధాకర్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలను వివరించారు. అనంతరం రీల్ మేకింగ్, వక్తృత్వ, డ్రామా, స్కిట్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సమత, నాగసేనారెడ్డి, నందిని, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల్లో కమ్యూనిస్టులదే ముందడుగు

సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మిర్యాలగూడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా అభివృద్ధి కోసం నిర్వహించిన పోరాటాల్లో కమ్యూనిస్టులదే ముందడుగని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్ నిర్మాణం దగ్గర నుంచి జిల్లాలో అన్ని సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుకు కమ్యూనిస్టులు ముందుభాగాన ఉండి పోరాడారన్నారు. డిండి రిజర్వాయర్ పనులు పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు ప్రాంతాల్లోని 3.5లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని అన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తిచేసి సాగు భూములకు నీరందించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు మరో మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయాలన్నారు. పార్టీకి 4,128 క్రియాశీలక సభ్యత్వాలు, 409 గ్రామశాఖలు ఉన్నాయన్నారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో మిర్యాలగూడ ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో నిర్వహించే పార్టీ జిల్లా మహాసభల్లో పనితీరును సమీక్షించుకుని భవిష్యత్ మూడేళ్ల కాలంలో చేపట్టనున్న కార్యాచరణను రూపొందించుకుంటామన్నారు. మహాసభకు 12వేల నుంచి 15వేలవరకు జనాన్ని సమీకరిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ప్రారంభమయ్యే మహాసభలకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు డబ్బీకార్ మల్లేష్, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, గౌతంరెడ్డి, పాండు, పాదూరి శశిధర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు మహేశ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పొనుగోడులో అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కనగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగోడు గ్రామంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజను గురుస్వాములు ఘనంగా నిర్వహించారు. పొనుగోడుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్ప, హనుమాన్ దీక్షాపరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత గణేష్, సుబ్రహ్మణ్య స్వామికి పూజలు నిర్వహించి 18 మెట్లతో ఏర్పాటు చేసిన అయ్యప్ప పడికి హారతి పూజలు చేశారు. అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వాముల భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. స్వామిశరణం, అయ్యప్పశరణం నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది. సుమారు 600 మంది స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పులకరం వెంకటేశం, గురుస్వాములు విఘ్నేశ్వర్, విశ్వేషర్, కట్ట అంజయ్య, డీలర్ వెంకటేశం పి.రాజీవ్, పులకరం అశోక్, నాగరాజు, కట్టవెంకన్న. సత్యనారాయణ, మహేందర్, కొండ రవి, కుమార్, ఉషయ్య, రామకృష్ణ, జోగు దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

మోదం.. ఖేదం

(5వ పేజీ తరువాయి)

సబ్‌కమిటీ వ్యవహారం ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉపాధ్యాయవర్గాల్లో సుమారు 200 మందికి, ఉద్యోగవర్గాల్లో దాదాపు 400 మందికి మాత్రమే ప్రయోజనం చేకూరనుంది. కానీ, స్థానికత ఉండి, ఇతర జిల్లాలకు బదిలీ అయిన మరో 900 పైచిలుకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాత్రం కష్టాలు తప్పవు. ప్రభుత్వం ప్రస్తుతం జారీ చేసిన జీవోలను మరోసారి సమీక్షించి స్థానికత ఉన్నవారిని సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, అక్కడ పోస్టులు ఖాళీగా లేకుంటే సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి బదిలీ చేయాలని బాధితులు, సంఘాల నాయకులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో స్పౌజ్ ఉన్న వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, దీనిపైనా ఓ నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై సీఎం, మంత్రులు దృష్టి పెట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని విన్నవిస్తున్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తుందనే నమ్మకం ఉంది



జీవో 317 బాధితులకు ఉపశమనం కలిగించే క్రమంలో మొదటగా ఇచ్చిన మూడు జీవోలను స్వాగతిస్తున్నాం. జీవో 317తో స్థానికత కోల్పోయి ఇబ్బందిపడుతున్నవారి విషయంలోనూ ప్రభుత్వం న్యాయం చేస్తుందనే విశ్వాసం ఉంది. తప్పకుండా వారి సమస్యను కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆశిస్తున్నాం. దశల వారీగా జీవో 317 బాధితులందరికీ న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం.

- బాల్‌రెడ్డి, టీజీపీఆర్‌టీయూ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు.

భక్తి పారవశ్యం





కార్తీక మాసం చివరి రోజు సోమవారం యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి భక్తుల సందడి నెలకొంది. కొండపైన ప్రధానాలయ ఉత్తర దిశ, శివాలయం దీపారాధనల స్థలాల్లో మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కల నెరవేరిన వేళ

- శిక్షణ పూర్తి చేసుకున్న సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు
- యాదాద్రి భువనగిరి జిల్లాలో 200 మంది యువత

ప్రజాసేవ, ప్రభుత్వ కొలువే లక్ష్యంగా కష్టపడి ఉద్యోగం సాధించిన యువత ఆనందానికి అవధుల్లేవు. తమ తల్లిదండ్రులు పడిన కష్టానికి వారి కలలను నిజం చేసినందుకు ఆనందంగా ఉందని కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకున్న యువకులు తెలిపారు. (ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్)



రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎంపికైన 731 మంది 9 నెలల శిక్షణను పూర్తి చేసుకున్నారు. సివిల్ మహిళా పోలీసులకు వరంగల్‌లో, ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లకు చెల్లాపురం హైదరాబాద్‌లో, సివిల్, ఏఆర్ పురుషులకు కరీంనగర్ సీటీసీ, డీటీసీలో, ఖమ్మంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న 2024 బ్యాచ్‌కు చెందిన 265 మంది సివిల్, 466 మంది ఏఆర్ కానిస్టేబుళ్లకు పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో యాదాద్రి భువన గిరి జిల్లాకు చెందిన సుమారు 200 మందికి పైబడి యువతీ యువకులకు పోలీస్ ఉద్యోగాలు లభించాయి. నవంబరు 21న పాసింగ్‌అవుట్ పరేడ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శనివారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఉద్యోగ విధులపై అవగాహన కల్పించారు. పాసింగ్ అవుట్‌పరేడ్‌లో పాల్గొన్న తల్లిదండ్రులకు నూతన ఉద్యోగులు సెల్యూట్ చేసి తమ గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. ఈ మేరకు శనివారం ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. రెండు, మూడు రోజుల్లో విధుల్లో చేరనున్నారు. 731 మందికి యాదాద్రి జోన్‌కు సుమారు 150 మందికి పైగా కేటాయించనున్నట్లు తెలిసింది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే..



తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. పోలీస్ శాఖలో ఉన్నత స్థానం కోసం మరిన్ని ప్రయత్నాలు చేసి కృషి చేస్తాను. మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఉద్యోగం వచ్చింది.

-గాయపాక మౌనిక, ఏఆర్ కానిస్టేబుల్

చిత్తశుద్ధిగా విధులు నిర్వహిస్తా



శ్రమించి సాధించుకున్న ఉద్యోగాన్ని విధి నిర్వాహణలో చిత్తశుద్ధి పని చేస్తా. నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తాను. నాకు ఉద్యోగం లభించడంతో మా కుటుంబంలో ఆనందం ఉంది. మా తల్లిదండ్రులు నర్సింహ, కలమ్మ ఆశలను నెరవేర్చాను. దురలవాట్లకు దూరంగా ఉంటూ శ్రమిస్తే పోలీస్ ఉద్యోగం సాధించవచ్చు. ఇందుకు ఆశా వాహులకు నా వంతు సహకారం అందిస్తాను.

- నీలం రాకేష్, ఏఆర్ కానిస్టేబుల్, భువనగిరి.

పెద్దనాన్న ప్రేరణతోనే ఉద్యోగం సాధించా



మా పెద్దనాన్న శ్రీనివాస్ భువనగిరి ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ప్రేరణ, శిక్షణతోనే మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించా. అమ్మానాన్న గోనూరు వేణుగోపాల్, ఉమారాణి, సోదరుల ప్రోత్సాహంతో శిక్షణను పూర్తిచేశా. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తా.

- గోనూరు హిమసింధు, ఏఆర్ కానిస్టేబుల్, భువనగిరి

ఆనందంగా ఉన్నది



ఉద్యోగం లభించడంతో మా కుటుంబంలో ఆనందం వెల్లువిరుస్తున్నది. పట్టణాలకు దూరంగా తండాలో మా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ మమ్మల్ని చదివించారు. మా ఉన్నతి కోసం వారు పడే మనో వేదన నిరం తరం నన్ను వెంటాడేది. దీంతో తల్లిద ండ్రుల నమ్మకాన్ని నిజంచేసేందుకు, సమాజంలో వారి గౌరవాన్ని పెంపొందించేందుకు శ్రమించి ఉద్యోగాన్ని సాధించాను.

లూనావత్ మమత, మైలారం తండా, బొమ్మలరామారం మండలం

మా అమ్మానాన్న కూలీ పనులు చేసి చదివించారు



అమ్మానాన్న శ్యామల సత్తయ్య, కవిత మా ఊరిలో కూలీ పనులు చేస్తూ చదివించారు. కాకతీయ యూనివర్సిటీలో ఎంఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాను. నాకు ఇద్దరు సోదరులు. మా కుటుంబ సభ్యుల ప్రోత్సా హంతో నేను పోలీస్ ఉద్యోగం సాధించాను. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరనున్నాను. కానీ నా తదుపరి లక్ష్యం గ్రూప్-1 సాధించడం. ఇందు కోసం ఉద్యోగ విధులు నిర్వహిస్తూనే తదుపరి నోటిఫికేషన్‌లో లక్ష్యాన్ని సాధిస్తాను. నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

- శ్యామల వేణుగోపాల్, సివిల్ కానిస్టేబుల్, మల్లేపల్లి, వలిగొండ

చిరు జల్లులు .. ఆందోళనలో రైతులు



- కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోనే ధాన్యం రాశులు
- ధాన్యాన్ని కాపాడుకునేందుకు తంటాలు
- జిల్లాకు పొంచి ఉన్న ఫెంగల్ తుఫాన్ ప్రమాదం

నిడమనూరు, పెన్‌పహాడ్, భువనగిరి టౌన్, దేవరకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పంటలు పండించిన అన్నదాతను ఫెంగల్ తుఫాను భయం వెంటాడుతోంది. ఆదివారం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురసి ధాన్యం కొంతమేర తడవడంతో రైతుల్లో కలవరం మొదలైంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రెండేళ్ల తర్వాత సాగర్ ప్రాజెక్టు నిండటంతో పాటు సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లాలో వానాకాలం సీజన్‌లో మునుపెన్నడూ లేనివిధంగా వరిని సాగు చేశారు. ఒక్క నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోనే 35వేల పైచిలుకు ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం వరి కోతలు ముగింపు దశలో ఉన్నాయి. ఆయకట్టు, నాన్ ఆయకట్టు గ్రామాల్లో వరి కోతలతో రైతులు బిజీగా ఉన్నారు. ధాన్యం రాశులతో మార్కెట్ యార్డులతో పాటు కొనుగోలు కేంద్రాలు నిండి ఉన్నాయి. ఈ ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. కుటుంబ సభ్యులతో సహా రైతులు కల్లాల వద్దే కాపలా ఉంటున్నారు.

నిడమనూరు మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 10, నిడమనూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 3, వెనిగండ్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో రెండు మొత్తం 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోళ్లు మందకొడిగా సాగడంతో ఈ కేంద్రాల్లో ధాన్యం రాశుల నిల్వలు పేరుకున్నాయి. కాంటాలు వేసి డబ్బు చేతికి అందే సమయంలో పడుతున్న వర్షంధ జల్లులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

● సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం, సింగిరెడ్డిపాలెం, అనాజిపురం, మహమ్మదాపురం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. తుఫాన్ ప్రభావంతో ధాన్యం తడవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందారు. తూకం వేయండంతో ఆలస్యమైనందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు కుప్పలుగా ఉన్నాయని రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● భువనగిరి పట్టణంలో ఆదివారం రాత్రి వర్షపు జల్లులు కురిసాయి.. అయితే రోజంతా ఎండ రానప్పటికీ కాస్త ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

● నల్లగొండ జిల్లా దేవరకొండలో ఆదివారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. వర్షం కురవడంతో చలి పెరగడంతో వృద్ధులు,చిన్నారులు ఇబ్బంది పడ్డారు. చలికి భయపడి ఉదయం ఏడు గంటల లోపు బయటికి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. చలి జ్వరాలు, జలుబు బాధితులు పెరిగారు.ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

నానా తంటాలు పడుతున్నాం

వేలాది రూపాయలు పెట్టబడులు పెట్టి పంటలు సాగు చేశాం. చేతికి అందే సమయంలో వర్షాలు పడుతున్నందున ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నాం. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను రైతులు వేగవంతం చేయాలి.

- రాములు, రైతు,నిడమనూరు

ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేస్తున్నాం



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటూ రైతులు తీసుకువస్తున్న ధాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటవెంటనే కొనుగోలు చేస్తున్నాం. మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా రైతుల ఖాతాలో సత్వరమే జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- జానయ్య, సొసైటీ సీఈవో, నిడమనూరు

● ప్రజా ప్రతినిధుల ఆట విడుపు..



ఎప్పుడూ బిజీగా ఉండే ప్రజాప్రతినిధులు ఆట విడుపుతో సరదాగా గడిపారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం బ్యాట్, బాల్‌తో మైదానంలోకి దిగారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బౌలింగ్ చేయగా, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బ్యాటింగ్ చేసి ఆకట్టుకున్నారు.



భక్తులతో యాదగిరి క్షేత్రం కిటకిట



● లక్ష్మీనృసింహుడి దర్శనానికి 50వేల మంది భక్తులు ● ఆలయ ఖజానాకు రూ.56,71,426 ఆదాయం

భువనగిరిఅర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం చివరి రోజు, వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వాహనాలపై వచ్చారు. పార్కింగ్ స్థలం సరిపడా లేకపోవడంతో వైకుంఠద్వారం ఇరువైపులా, కొండకింద ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రహదారిలో వాహనాలు భారీగా పార్కింగ్ చేశారు. కార్తీక మాసం చివరి రోజు కావడంతో కొండకింద వ్రత మండపాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆరు విడతల్లో దంపతులు సత్యదేవుని వ్రతాలు ఆచరించారు. కొండ కింద లక్ష్మీపుష్కరిణి, సత్యదేవుడి వ్రత మండపాలు, వైకుంఠ ద్వారం, కొండపైన ప్రధానాలయ ఉత్తర దిశ, శివాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాదనల స్థలాల్లో మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన గర్భాలయంలో పంచనారసింహులతో పాటు శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 50వేల మంది భక్తులు ఇష్టదైవాలను దర్శించుకోగా ఆలయ ఖజానాకు రూ.56,71,426 ఆదాయం సమకూరింది. ఉభయ క్యూలైన్లల్లో భక్తులు బారులు తీరగా వీఐపీ దర్శనానికి(రూ.150 టికెట్) గంట సమయం, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. క్యూ కాంప్లెక్స్‌లతో పాటు ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద విక్రయశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల రద్దీకి తగినట్లుగా కొండపైకి, కిందికి తరలించేందుకు అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు. రోజువారీ పర్యటనలో భాగంగా ప్రత్యేక దర్శనం భక్తుల వద్ద టికెట్లు తనిఖీ చేసిన ఈవో భాస్కరరావు భద్రతా సిబ్బందికి తగు సూచనలు చేశారు.

గతం కంటే అధికంగా రెండు వేల వ్రతాలు

కార్తీక మాసం నవంబరు 2న ప్రారంభమై డిసెంబరు 1న ముగిసింది. సుమారు నెల రోజుల పాటు 23,248 మంది దంపతులు వ్రతాలను ఆచరించారు. 2023 కార్తీక మాసంలో 20,524 వ్రతాలు జరిగాయి. గతంతో పోల్చితే ఈ ఏడాది 2,724 మంది జంటలు అధికంగా వ్రతాల్లో పాల్గొన్నాయి. ఏటేటా వ్రతాల సంఖ్య పెరుగుతుందని ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చన లు,ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామి, అమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. ఆలయ తూర్పు తిరువీదిలో సాయంత్రం సంగీత సభలు నిర్వహించారు. రాధిక సంగీత, నృత్య అకాడమీ భక్తి సంగీత కార్యక్రమం జరిగింది.



భక్తజనసంద్రం చెర్వుగట్టు క్షేత్రం

నార్కట్‌పల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి లక్ష పుష్పార్చన వేడుక ఘనంగా జరిగింది. అమావాస్య అందునా ఆదివారం కూడా కావడంతో భక్తులు, శివసత్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మానసిక రుగ్మతలతో ఇబ్బంది పడేవారు ఆదివారం అమావాస్య రోజున చెర్వుగట్టు గుట్టపై నిద్ర చేస్తే ఇబ్బందులు తొలగుతాయనే నమ్మకంతో భక్తులు భారీగా చేరుకోవడంతో కొండ భక్త జనసంద్రంగా మారింది. తొలుత ప్రధానాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివన్నామ స్మరణల మధ్య పల్లకీ సేవతో మహా మంటపానికి చేర్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చక స్వాములు, వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య లక్ష పుష్పార్చన ఉత్సవం ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. పుష్పార్చన వేడుక అనంతరం స్వామివారి చెంత పూజలందుకున్న పుష్పాలను స్వీకరించేందుకు భక్తులు పోటీపడ్డారు. బతుకమ్మలతో శివసత్తుల ఆట పాటలు భక్తులను అలరించాయి.

కనగల్: కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

అర్వపలి : సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం సమీపంలోని అఖండజ్యోతి స్వరూపసూర్యనారాయణ క్షేత్రంలో ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటలకు స్వామివారికి మహాసభ యాగం కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు.



చెర్వుగట్టు క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు వెంకటసాయి



నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ చత్రపతి శివాజీ స్పోర్ట్స్ ఫౌండేషన్‌కు చెందిన క్రీడాకారుడు రాచూరి వెంకటసాయి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో నవంబరు 3 నుంచి 5 తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ -17 బాలుర విభాగంలో ఫుట్‌బాల్ పోటీల్లో వెంకటసాయి ఫార్వర్డ్ క్రీడాకారుడిగా జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లాడు. ప్రతిభ కనబర్చిన వెంకటసాయిని జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. జమ్మూకాశ్మీర్ నగరంలో నవంబరు 30 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు జరిగే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలుర ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ నల్లగొండ చత్రపతి శివాజీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఐదేళ్ల నంచి శిక్షణ తీసుకున్నాడు. జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రెండుసార్లు ప్రాతినిధ్యం వహించాడు. జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంపై ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంభం రాంరెడ్డి, చత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు బొమ్మపాల గిరిబాబు అభినందించారు. నల్లగొండ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన రాచూరి గణేష్ కుమారుడు రాచూరి వెంకటసాయి హాలియాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ

హైదరాబాద్‌లో 2019లో జరిగిన శ్రీనిధి ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ క్లబ్ ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి కేరళ రాష్ట్రంలో జరిగిన ఐలీగ్స్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇంకా పోటీలు జరగలేదు. 2023లో అండమాన్ నికోబార్ ప్రాంతంలో జరిగిన 67వ జాతీయ స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు.

ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా
హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూ విస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పనులు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిం చే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూ ముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోలోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్లు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించినట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

సీఎంఆర్ఎఫ్ సాయం రూ.830 కోట్లు!

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో
రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు టాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్లు షికా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్టు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్టు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షికా గోయల్ సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- ట్రాక్టర్ కింద పడి ఒకరు, కారు బోల్తా పడి మరొకరు

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం లక్ష్మీపురం గ్రా మంలో శనివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లక్ష్మీపురం గ్రామానికి చెందిన పేరుపొంగు మదన్(23) గ్రామం శివారులోని పాతకోటి శ్రీను కౌలుకు చేస్తున్న పొలంలో వరికోత మిషన్‌పై డ్రైవర్ కూలీ పనికి వెళ్లాడు. సాయంత్రం 3 గంటల సమయంలో వడ్లను ట్రాక్టర్ ట్రాలీలో పోసే క్రమంలో వాహనాన్ని మలుపుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ట్రాక్టర్ ట్రాలీ టైరు మదన్ తల మీది నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కు టుంబసభ్యులకు అప్పగించినట్లు రూరల్ ఎస్ఐ లోకేష్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నటు చెప్పారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలం పెద్దకొందూరు శివారులో కారు బోల్తా పడి యువకుడు దుర్మరణం చెందాడు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామానికి చెందిన బానాల నవీన్ రెడ్డి (30) చౌటుప్పల్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి మారుతి కారులో వస్తుండగా కొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డి వ్యవసాయం బావి వద్ద రోడ్డు పక్కన ఉన్న గుంతలో అదుపుతప్పి పడిపోయింది. స్థానికులు గమనించి అద్దాలు పగులగొట్టి నవీన్ రెడ్డిని బయటకు తీశారు. తీవ్ర గాయాలకు గురైన నవీన్ రెడ్డి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. నవీన్‌రెడ్డి సోదరుడు విజయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.127	208	238
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.90 అడుగులు
టీఎంసీలు	306.0414
ఎడమకాల్వకు నీటి విడుదల	4,881
కుడికాల్వకు	9,104
విద్యుత్ కేంద్రం ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	00
ఇన్‌ఫ్లో	35,315 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,385 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.41 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	8,564 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	4000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.75 అడుగులు
టీఎంసీలు	4.40
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	24.18 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	240.68 క్యూసెక్కులు

క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్, అధికారులు

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సకల సౌకర్యాలతో ఉన్న క్రీడా ప్రాంగణాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంజీయు వీసీ అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూయూనివర్సిటీల్లో రానున్న రోజుల్లో మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి తీసుకవస్తానని క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. షాట్‌పుట్, లాంగ్‌జంప్, జావలిన్, డిస్కస్ త్రో అంశాలల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, శ్యాంసుందర్, మురళి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, నరేష్, స్వప్న, మహేశ్వరి, మహేష్, అనిల్, వెంకన్న, వాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్న అధికారులు

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామంలోని జంగాలకాలనీ సమీపంలోని ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమించేందుకు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు యత్నించారు. దీంతో స్థానికులు ఈ విషయాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ హరిబాబును సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. ఆర్ఐ సత్యనారాయణ ప్రదేశానికి వెళ్లి పరిశీలించి ఎక్స్‌కవేటర్ నడుపుతున్న వ్యక్తులు తమ వద్ద భూమికి సంబంధించిన పట్టా కాగితాలు ఉన్నాయని చెప్పారు. తహసీల్దార్ వద్దకు వచ్చి చూపించిన తరువాతనే పనులు చేసుకోవాలని అంతవరకు పనులను నిలిపివేయాలన్నారు. కాగా ఈ గుట్ట ప్రాంతంలో సుమారు నాలుగు ఎకరాల వరకు ప్రభుత్వ భూమి, అటవీ భూములు ఉన్నాయని, ఆ భూములను కాజేసేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ అటవీ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న అక్రమార్కులు

కృత్రిమ పాలు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- 120 లీటర్ల పాలు స్వాధీనం

భువనగిరి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృత్రిమ పాలు తయారు చేస్తున్న ఓ వ్యక్తిని ఆదివారం ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకొని భువనగిరి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్ కువ ార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురం గ్రామానికి చెందిన వల్లపు నర్సింహ పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా డోలోఫోర్ పాల పౌడర్‌తో కృత్రిమ పాలను తయారు చేస్తుండగా ఎస్‌వోటీ పోలీసులు అతడి ఇంటిపై దాడులు నిర్వహించి 120 లీటర్ల కృత్రిమ పాలు, కిలోల బరువు గల 3 డోలోఫోర్ ప్యాకెట్లను స్వాధీనం చేసు కున్నారు. అయితే గేదె పాలు అని చెప్పి అతను భువనగిరి ప్రాంతంలోని హోటల్, స్వీట్ హౌజ్‌లలో విక్రయిస్తుంచి మోసం చేస్తు న్నాడని పోలీసులు తెలిపారు. అయితే అతడి వద్ద స్వాధీనం చేసుకున్న కృత్రిమ పాల శాంపిల్స్‌ను సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఫుడ్‌సేఫ్టీ కార్యాలయంలోని ల్యాబ్‌కు తరలి ంచనున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



డోలోఫర్ ప్యాకెట్లు, తయారు చేసిన పాలు

30 కిలోల గంజాయి పట్టివేత.?

కోదాడ రూరల్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దోరకుంట గ్రామంలో ఆదివారం ఉదయం గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తుల వద్ద నుంచి ఎక్సైజ్ పోలీసులు 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఇరువురు వ్యక్తులు మండలంలో గంజాయి విక్రయించేందుకు కారులో వచ్చినట్లు సమాచారం. ప్రతినెలా వారు గంజాయిని ప్యాకెట్లుగా తయారు చేసి కోదాడ, నల్లబండగూడెం, మంగలితండా, రెడ్లకుంట గ్రామాలతో పాటు కోదాడలోని బంజారా కాలనీకి చెందిన వీరు ప్రతినెలా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఎక్సైజ్ పోలీసులు మాత్రం నిందితుల వివరాలను వెల్లడించేందుకు నిరాకరించారు.

దాడిపై చేసిన వారిపై చర్య తీసుకోవాలి

దామరచర్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తనపై దాడి చేసి గాయపరిచిన చర్య తీసుకోవాలని దామరచర్ల మండలం తెట్టెకుంట గ్రామానికి చెందిన ఆవుల పెదఎల్లయ్య పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. తెట్టెకుంట గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తన పొలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకున్న తనపై దాడిచేసి గాయపర్చినట్లు పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

జూదరుల అరెస్ట్

భువనగిరి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులో ఆదివారం సాయంత్రం భువనగిరి ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించగా బహిరంగ ప్రదేశాల్లో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు. వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామానికి చెందిన నాగేందర్, సీహెచ్ నర్సింహ, సీహెచ్ శంకర్, సత్తయ్య, వెం కన్న, బాలనర్సింహ, రాజమల్లును అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 21,610 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తిప్పర్తిలో..

తిప్పర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో పేకా డుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని చిన్న సూరారం గ్రామ పంచాయతీ పరిధిలోగల పావురాలగూడెం గ్రామం శివారులో పరిసర గ్రామాలకు చెందిన పాయలి శంకర్, పుట్ట సైదు లు, మండల రాజు, పాలకూరి కండ్ల, చనగాని నగేష్, బండగొర్ల వీరయ్య పేకాట ఆడుతుండగా ఎస్ఐ సాయి ప్రశాంత్ అరె స్ట్ చేసి కేసు నమోదు చేశారు. వారి వద్ద ఉన్న రూ.40 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు, రెండు సెట్ల పేక ముక్కలు, స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి, డిసెంబరు 1 : కారు, బైక్‌ను ఢీకొని రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి.. ఈ ఘటన గరిడేపల్లి మండలంలో ఆదివారం జరిగింది. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన యరగొర్ల మదార్. పల్సర్ బైక్‌పై కోదాడ, మిర్యాలగూడ ప్రధాన రహదారిపై ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో మేళ్లచెరువు మండలం వేపల సింగారం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులతో శబరికి వెళ్తున్న. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఎర్టీగా కారు వెనుక నుంచి వచ్చి మదార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో బైక్‌పై నుంచి కింద పడిన మదార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే 108లో మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై స్థా నిక ఎస్ఐ.చలికంటి నరేష్‌ను వివరణ అడగగా ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు

రేషన్ బియ్యం పట్టివేత

చింతపల్లి, డిసెంబర్, 01 (ఆంధ్రజ్యోతి) : వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రా మానికి చెందిన జిందిగల్లా మహేష్ వ్యాన్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరుకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చుస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలకే ఆదర్శమయ్యేలా!



శరవేగంగా జరుగుతున్న పాఠశాల నిర్మాణ పనులు

- రూ. 4.5 కోట్లతో స్కూల్ నిర్మాణం
- ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు
- బొట్టుగూడ పాఠశాలలో సాగుతున్న పనులు
- వచ్చే విద్యా సంవత్సరానికి ప్రారంభమయ్యే అవకాశం

రామగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకే ఆదర్శమయ్యేలా అత్యాధునిక సౌకర్యాలు, వసతులతో కూడిన పాఠశాల జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌లో గల బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల రూపుదిద్దుకుంటోంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా నూతనంగా పాఠశాల నిర్మితమవుతుంది. పట్టణంలో 980 గజాల స్థలంలో నిర్మించే ఈ పాఠశాలలో 35 ఏసీ గదులు, సీసీ కెమెరాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ల్యాబ్‌లు, లైబ్రరీ, ఇన్‌డోర్ గేమ్ హాల్, మీటింగ్ హాల్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో ఈ పాఠశాల నిర్మితమవుతోంది. ఇప్పటికే ఈ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరంలో ఈ పాఠశాల ప్రారంభం కానుంది.

ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో...

70 ఏళ్ల కల వచ్చే విద్యా సంవత్సరానికి నెరవేరబోతుంది. 70 సంవత్సరాల చరిత్ర కలిగిన బొట్టుగూడ హైస్కూల్‌కు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నేటి వరకు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ పాఠశాలపై ఎవరూ దృష్టి సారించకపోవడంతో అద్దె భవనాల్లోనే విద్యార్థులకు విద్యాబోధన జరిగింది. ఈ క్రమంలో నల్లగొండ శాసనసభ్యుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 2014లో పట్టణ పర్యటనలో భాగంగా ఈ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అప్పటికే శిథిలావస్థకు చేరడంతో నూతన భవనాన్ని తన సొంత నిధులతో నిర్మిస్తానని అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే స్థలం లేకపోవడంతో నేటి వరకు ఆలస్యమైంది. అయితే ఇటీవల కాలంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన కుమారుడు ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ పేరిట ప్రకాశంబజారులో ఉన్న ప్రభుత్వ స్థలంలో పాఠశాల నిర్మించాలని నిర్ణయించారు.

కార్పొరేట్‌కు ధీటుగా ...

కార్పొరేట్ పాఠశాలను మించి ఈ పాఠశాల నిర్మితమవుతుంది. సుమారు రూ.4.5 కోట్ల వ్యయంతో 5 అంతస్థుల భవనంలో 35 తరగతి గదులు, 7 ల్యాబ్‌లు, లైబ్రరీ, లాంగ్వేజీ లైబ్రరీలు, ఇన్‌డోర్ గేమ్ హాల్, మీటింగ్ హాల్, ప్రతి తరగతి గదిలో ఏసీ సౌకర్యం, సీసీ కెమెరాలు, లిఫ్ట్, డిజిటల్ క్లాస్ రూం, స్పోకెన్ ఇంగ్లీష్ ప్రత్యేక తరగతి, కమ్యూనికేషన్ ప్రత్యేక తరగతి గదులు ఉండనున్నాయి. దీంతో పాటు ఇప్పుడున్న బోధకులు, సిబ్బందికి అదనంగా ఎలక్ట్రికల్ హెల్పర్, ప్లంబర్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ ప్రత్యేక బోధకులు, వాటర్ సప్లై ఆపరేటర్, సెక్యూరిటీ గార్డులు, స్కావెంజర్లు, బిల్డింగ్ మేనేజర్లు వంటి 15 మందికి ఈ ఫౌండేషన్ ప్రత్యేక వేతనాలు ఇచ్చి ఈ పాఠశాలలో నియమించపోతోంది.

వెయ్యి మంది విద్యార్థులకు ప్రయోజనం...

నూతనంగా నిర్మితమవుతున్న ఈ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో సుమారు వెయ్యి మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. దీంతో పాటు వీరికి అవసరమైన మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కూడా కల్పించనున్నారు. అయితే ఇప్పటివరకు ఈ పాఠశాలలో హైస్కూల్‌లో 150 మంది, ప్రైమరీ స్కూల్‌లో 150 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఇన్నేళ్లుగా ఇబ్బందులు పడిన విద్యార్థులు

ఎంతో చరిత్ర కలిగిన బొట్టుగూడ పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు విద్యనభ్యసించి ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ ప్రభుత్వ పాఠశాలకు 70 ఏళ్లు గడిచినా సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నేటి వరకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అద్దె భవనంలో కొనసాగిన పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపడా లేకపోవడంతో నానాఅవస్థలు పడ్డారు. పట్టణ నడిబొడ్డున ప్రభుత్వ పాఠశాలకు ఇన్నాళ్లు సొంత భవనం కూడా లేదు. ఎట్టకేలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో బొట్టుగూడ హైస్కూల్ భవనానికి సొంత భవనం నిర్మాణం జరుగుతుండటంతో ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా నిర్మాణం



కార్పొరేట్ స్థాయిని మించి ప్రభుత్వ పాఠశాలలో ఏసీ గదులు, సీసీ కెమెరాలు, డిజిటల్ క్లాస్‌లు, కంప్యూటర్ క్లాసులు, స్పోకెన్ ఇంగ్లీష్, లైబ్రరీలు, ల్యాబులు, ఇన్‌డోర్ గేమ్ హాల్, మీటింగ్ హాల్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణమవుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన కుమారుడు ప్రతీక్‌రెడ్డి పేరిట సొంత నిధులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారుగా 1000 మంది వరకు చదువుకునేలా సౌకర్యాలు ఉన్నాయి.

● శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్, నల్లగొండ

సమాచారం

ఉపాధి పనులపై నేడు సామాజిక తనిఖీ

కట్టంగూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కట్టంగూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉపాధి పనులపై ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్నట్లు ఏపీవో కడియం రాంమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కార్యదర్శులు, కూలీలు, మేట్లు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు శాలిగౌరారంలో వైద్యశిబిరం

శాలిగౌరారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు శాలిగౌరారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ తెలిపారు. లయన్స్ క్లబ్, నల్లగొండకు చెందిన సంకల్ప సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవరకొండలో కంటి వైద్యశిబిరం

దేవరకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవనంలో సోమవారం మెడివిజన్ ఐకేర్ హాస్పిటల్ నిర్వాహకులు కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు రిటైర్డ్ ఉద్యోగ సంఘం దేవరకొండ అధ్యక్ష, కార్యదర్శులు టి.నర్సింహ, అంకం చంద్రమౌళి తెలిపారు. ఆదివారం రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రభుత్వ పెన్షనర్లు, ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారిని హైదరాబాద్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు యూసుఫ్ షరీఫ్, యాదగిరి, లింగయ్య, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

హనుమ గాయత్రి మహాయజ్ఞం రేపు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగడిపేట గ్రామంలోని శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 3వ తేదీన ద్వితీయ హనుమగాయత్రి మహాయజ్ఞం మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు భక్తాంజనేయస్వామి దేవస్థానం కమిటీ తెలిపింది. మంగళవారం ఉదయం మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, సింధూర అభిషేకం, మహాగణపతిపూజ, స్వస్తి పుణ్యహవాచకం, అఖండ దీపారాధన, కంకణధారణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, హనుమద్గాయత్రి మహాయజ్ఞం, పూర్ణాహుతి (మహానివేదన) కార్యక్రమాలు గ్రామ పురోహితులు చింతపల్లి శ్రీనివాస్‌శర్మ, రాయప్రోలు మురళిశర్మ గురుస్వామి, మహేశ్వరం శివయ్యాచారి గురుస్వామి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి విజయోత్సవ వారోత్సవాలు

మిర్యాలగూడటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో విజయోత్సవ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ తెలిపారు. ఆదివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపటి నుంచి ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహించే విజయోత్సవాల్లో ప్రజలందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యాలయంతో పాటు అమరవీరుల స్తూపం, స్వతంత్ర్య సమరయోధుల విగ్రహాలను దీపాలంకరణ చేస్తున్నామన్నారు. వారం రోజులతో పాటు స్వచ్ఛత కార్యక్రమాలతో పాటు 2కే రన్, ముగ్గుల పోటీలు, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు విజయోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

చింతపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదని అన్నారు. వెంటనే రుణమాఫీతో పాటు రైతుభరోసా నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు.

'గురుకుల'ను సందర్శించిన బీఆర్‌ఎస్వీ నాయకులు



నల్లగొండలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామియాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి కట్ట శ్రీను, కిరణ్, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

నర్సింహయ్య ఆశయ సాధనకు కృషి



నర్సింహయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భగత్, నాయకులు

నిడమనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య నిత్యం పేదల సంక్షేమం కోసమే పని చేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. నర్సింహయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలోని వేంపాడ్ స్టేజీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ నర్సింహయ్య పదవిలో ఉన్నా లేకున్నా తన పోరాటాన్ని ఆపలేదని, ప్రజల అభ్యున్నతి కోసమే చివరి వరకు పని చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి నర్సింహయ్య చలవేనన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు విజయేందర్‌రెడ్డి, రామచందర్‌నాయక్, సాదం సంపత్‌కుమార్, రవి, భిక్షానాయక్, జయమ్మ, కొండల్, నాగయ్య సైదులు పాల్గొన్నారు.

● నకిరేకల్ పట్టణంలోని మెయిన్‌సెంటర్‌లో నర్సింహయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు గాదగోని కొండయ్య, మర్రి వెంకటయ్య, వంటిపాక వెంకటేశ్వర్లు, ఆకుల భాస్కర్, వీరార్జున్‌రెడ్డి, వెంకన్న, మట్టయ్య, లింగయ్య, నగేష్, బాలు, యాదగిరి, శ్రీను, సైదులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమని మాజీ ఎంపీపీ తేరా సత్యనారాయణ రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణానికి చెందిన సూర్య ఆస్పత్రి ఎండీ పాల్వాయి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పీఏపల్లి మండలంలోని రాంపురం గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజ శ్రేయస్సులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తేరా పర్వత్‌రెడ్డి, కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, శివాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ఆస్పత్రికి ఎయిడ్స్ నియంత్రణ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఐసీటీసీ కౌన్సిలర్ మంచ్యానాయక్

నాగార్జునసాగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో ఐసీటీసీ కౌన్సిలర్ మంచ్యా నాయక్‌కు ఉత్తమ సేవా అవార్డు లభించింది. నియోజకవర్గంలో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నియోజకవర్గంలో ఎయిడ్స్ కేసులను తగ్గించేందుకు కృషి చేసినందుకు ఆయన అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, డాక్టర్ హరికృష్ణ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మంచ్యానాయక్ మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

కవిత్వంలోనూ రాణించాలి

చింతపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యతో పాటు కవిత్వంలో రాణించాలని, అప్పుడే గుర్తింపు ఉంటుందని అమరావతి ఫౌండేషన్ అధ్యక్షురాలు బెల్లంకొండ విజయలక్ష్మి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో ఆదివారం మండలంలోని గొడుకొండ్ల గ్రామానికి చెందిన కడారి పెద్దయ్య కొమరంభీమ్‌పై కవితగానం చేశారు. ఈ సందర్భంగా పెద్దయ్యను ప్రముఖ కవులు శాలువాతో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెద్దయ్య చిన్న వయస్సులో రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో కవి సమ్మేళనాల్లో కవితగానం చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో బుక్ ఫెస్టివల్ సొసైటీ సభాధ్యక్షుడు బోనం గణేష్, ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు పొల్లూరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయం

● నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం, వేదికపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండటౌన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పేదల కు, చదువుకునే విద్యార్థులకు ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదుకోవడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాలలో నిర్వహిస్తున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్ సీజన్-5 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. పేదలకు, పేద విద్యార్థులకు సహాయం చేయడంలో కోమటిరెడ్డి బ్రదర్స్ ముందుంటారని అన్నారు. జిల్లా అభివృద్ధి ప్రదాత కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన తనయుడు ప్రతీక్‌రెడ్డిని కోల్పోయిన తర్వాత ఎంతోమంది పేద విద్యార్థుల చదువుకు సహకారం అందిస్తూ వారిలో తన కుమారుడిని చూసుకుంటున్నారని అన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్య, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ సేవకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు, క్రికెట్ ఆర్గనైజర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఆంగోతు ప్రదీప్‌నాయక్, బోనగిరి ప్రభాకర్, ముత్తినేని నాగేశ్వరరావు, జూలకంటి శ్రీనివాస్, ఆలకుంట్ల మోహన్‌బాబు, బొజ్జ శంకర్, ఇంతియాజ్, బోగరి ఆనంద్, రవి, జానయ్య, మధుసూదన్‌రెడ్డి, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలి



నకిరేకల్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన వారికి ఎమ్మెల్యే వీరేశం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మేక నాగయ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ రజితశ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఉన్నత పాఠశాలల వి ద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు ఎంఈవో అంజయ్య బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో వాసవి, సీఆర్‌డీ కే.సైదులు, పాఠశాలల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

● కనగల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాఠశాల విద్యార్థులకు కనగల్‌లోని ఎమ్మార్సీ భవనంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో పద్మ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఆరూరి జానయ్య, ఎం.వెంకటయ్య శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలి'

నకిరేకల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం యాదవులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ పేర్కొన్నారు. నకిరేకల్ పట్టణంలో ఆదివారం యాదవ విద్యావంతుల వేదిక నియోజకవర్గ సమావేశంలో నిర్వహించారు. నకిరేకల్ మండల అధ్యక్షుడిగా యేషబోయిన పందుయాదవ్, కార్యదర్శిగా గుడిపాటి రాజును ఎంపిక చేశారు. కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి మండల కమిటీలను నియమించారు. సమావేశంలో బొల్లం సత్తయ్యయాదవ్, నాయకులు నోముల సైదులుయాదవ్, నోముల శేషుయాదవ్, కొమ్మనబోయిన సైదులుయాదవ్ పాల్గొన్నారు.

గౌడ కులస్థులు ఐక్యంగా ఉండాలి

కట్టంగూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులు ఐక్యంగా ఉండాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు సోమగాని శంకర్‌గౌడ్ అన్నారు. కట్టంగూరులో ఆదివారం గౌడ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వనభోజన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గౌడ కులస్థులు ఐకమత్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో గౌడ కులస్థులు ఎరుకల సత్తయ్య, పోగుల జగన్, కానుగు వెంకటేశం, ఎరుకల శ్రీనివాస్, ఎరుకల రవి, పొడిచేటి రాములు, చెనగోని శ్రీనివాస్, నగేష్, లక్ష్మీనారాయణ, పుల్లయ్య, జాని, నాగరాజు, నగేష్, రమేష్ పాల్గొన్నారు.

జడ్జిగా ఎంపికైన తేజస్వినికి ఘన సన్మానం

కొండమల్లేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన తేజస్విని ఆదివారం మండలకేంద్రంలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్‌పాషా మాట్లాడుతూ మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం హర్షనీయమని, మున్ముందు మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నూతనకంటి ఈశ్వర్, మంగ, పెద్దిశెట్టి సత్యనారాయణ, నరేష్, అంజన్, అనిల్‌యాదవ్, తుకారాం, బాబునాయక్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న కోమటిరెడ్డి

మునుగోడు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అన్నారు. మండలంలోని కొరటికల్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ఎఫ్ నుంచి గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన చెక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మందుల బీరప్ప, దండు లింగస్వామి, మందుల అంజయ్య, అరెకంటి పాపయ్య, యాదయ్య, యాదగిరి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేయాలి

గుర్రంపోడు, డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు కమిటీని ఏర్పాటు చేసి కాపాడాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బహుజన ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను పెంచి అమలుచేయాలని అన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు అందుగుల స్వరణ్, వస్కుల విజయ్, రామకృష్ణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే దీక్షా దివస్'

మిర్యాలగూడటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసమే దీక్షా దివస్ పేరుతో హంగామా చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్ర ధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో ఎంపీగా ఉన్న మాజీ సీఎం కేసీఆర్ పార్లమెంట్‌కే వెళ్లలేదని అన్నారు. అందరి కృషితోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని అన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతో నే ప్రమాదాల నివారణ సాధ్యమని మహిళా క్లబ్ సభ్యురాలు గుడిపాటి అనిత అన్నారు. పట్టణంలోని కృష్ణాకాలనీలో మహిళలకు గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్యాస్ కంపెనీల నిర్వాహకులు సురక్షిత గ్యాస్ వినియోగం, పొదుపు, 1906 గ్యాస్ అత్యవసర నెంబ ర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం గ్యాస్ సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవీన్, సునీత, మాధవి, సరిత, పద్మావతి, భాగ్యలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక, మండల పూజలు



వేములపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

చింతపల్లి, వేములపల్లి, కొండమల్లేపల్లి, నార్కట్‌పల్లి, డిసెంబ రు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాలోని ఆలయాల్లో ఆదివారం కార్తీక పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు పడి పూజలను ఘనంగా నిర్వహించారు. దీంతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

● చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, బాదేపల్లి పులిరాజ్‌గౌడ్, ఆలయ పూజారి శ్రీకాంత్‌శర్మ పాల్గొన్నారు.

● వేములపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో మమత, పద్మ, కవిత, కల్పన, యశోద, వినోద, అరుణ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండలంలోని గుర్రపుతండాలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజకు మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ హాజరయ్యారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించాంరు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని జువ్విగూడెంలో ఉమా మహేశ్వర స్వామి దేవస్థానంలో వార్షికోత్సవాలు ముగిశాయి. 365 మట్టిలింగాలతో పార్థీవ లింగార్చన ఉత్సవం ఆద్యంతం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. అనంతరం రుద్రహోమం, పూర్ణాహుతిని శాస్త్రప్రకారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు సాగి శైలేంద్రశర్మ యాజ్ఞీకంలో జరిగిన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.